# నవ్య కాంతుల సిరులనొసగే 'సంక్రాంతి'..

**(మొదటి పేజీ తరువాయి)** అలా ధనుస్సు రాశి నుంచి మకరరాశి లోకి ప్రవేశించే సమయమే మకర సంక్రమణం..దీనినే 'సంక్రాంతి' పండుగ అంటారు. దీంతో దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది.. దక్షిణాయణంలో ప్రజలు వానలు, చలి వంటి ప్రకృతి ఒడిదుడుకులకు ఇబ్బంది పడుతారు..కానీ ఉత్తరాయణంలో వానలు తగ్గి, చలి, ఎండ కలసిన ఆనందమైన వాతావరణం ఏర్పడుతుంది. దీంతో ప్రకృతిలో నూతనోత్తేజం కనిపిస్తుంది. ఉత్తరాయణం దేవతలకు పగటి కాలం అని, అందుకే ఆ సమయంలో యజ్ఞ, యాగాలు చేయడం మంచిదని పండితులు తెలుపుతున్నారు..అందుకే కురుక్షేత్ర యుద్దంలో అంబులతో అంపశయ్యపై మరణ స్థితిలో ఉన్న భీష్ముడు తన మరణం మకర సంక్రాంతి ఉత్తరాయణం వరకు జీవించేలా అంపశయ్యపైనే ఉండేలా వరం తీసుకుని ఉత్తరాయణం ప్రారంభంలోనే మరణిస్తాడని భారతంలో ఉన్నట్లు చెప్పుతున్నారు..మకర సంక్రాంతి రోజున పల్లెల్లో నెలకొనే సందడిని మాటల్లో చెప్పలేం. పల్లెపడుచులు అందమైన ముగ్గులను దిద్ది ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. వాటిపై మందార, బంతిపూలు ఉంచి పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ముఖ్యంగా పెద్దలను జ్ఞాప్తికి తెచ్చుకోవటం, నూతన వస్త్రధారణతో ఆనందంగా గడపడం, కొత్త అల్లుళ్ళు, ముగ్గుల పోటీలు ఈ పండుగ ప్రత్యేకత.. ముత్తైదువులకు పసుపు పోసి ఇంటి పేరంటాలను భక్తి శ్రద్దలతో కొలుస్తారు..పండ్లు, ఫలహారాలు సమర్పిస్తారు..హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల సందడి, జంగమయ్యల దీవెనలు, భజన బృందాల గానాలాపనల కోలాహలంతో ఇంటిల్లిపాదిని పిల్లా, పెద్దలను ఆనందింపజేసే పండుగ సంక్రాంతి..

**కనుమ పండుగ..పశువులే రైతుకు అండగ :** సంక్రాంతి మరుసటి రోజున కనుమ పండుగను పశువులతో కలసి చేసుకుంటారు..ప్రకృతి దేవుడైన సూర్యనారాయణున్ని ఆరాధించి, పొంగళ్లు పొంగించి, పశువులకు స్నానాలు చేయించి రంగులు, పూలతో అలంకరించి పూజిస్తారు..ఏడాది పాటు రైతు తన కష్టసుఖాల్లో పాలుపంచుకునే పశువులను పూజించేందుకు రైతులు ఎంతో ఇష్టపడతారు..కనుమ రోజు వీటిని సింగారించుకుంటారు..పశువులను అలంకరించాక ఆవుల దొడ్లకు పూజ చేసి తోరణాలు కడుతారు. అదే విధంగా గ్రామంలోని గంగరాతి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. వీటిని గంగరాతి చుట్టూ మెరవణి చేసాక కొత్త వరిగడ్డి, ఉలవ పొట్టు మేతగా పెడతారు. మారుతున్న వాతావరణానికి తగ్గట్టుగా రైతు ఆరోగ్యాన్ని చూసుకోవాలనే సూక్తి ఈ పండుగలో ఉంది.. అందుకే కనుమ నాడు మినుము తినాలని సామెత ఉంది. ఇందులో ఉండే పోషక విలువలు అన్నదాతను మరింత ఆరోగ్యంగా ఉంచుతాయి.. అయితే ప్రస్తుతం మనిషి జీవితం బిజిగా మారిపోయింది. సరదాగా పండుగ మూడు రోజులు గడుపుదామన్నా అవకాశం లేని వారెందరో.. అందరికి సంక్రాంతి సెలవు రోజే అయినా కనుమనాడే తిరిగి విధుల్లోకి వెళ్లాల్సి రావచ్చు.రెండు రోజులు అందరితో కలిసి వెళ్లిపోయేందుకు సిద్దమవుతారు.. అయితే ఆ ఆనందం కనీసం మరో రోజు మిగిలి ఉండాలనే ఉద్దేశ్యంతో కనుమ నాడు కాకి కూడా వాలదనే సామెతను పెట్టారు.. అంటే ఆ రోజు ఎక్కడికీ ప్రయాణం చేయకూడదని నమ్మకం..ఇక సాయంత్రం గ్రామాల్లో పశువులకు పరుగు పందాలు నిర్వహిస్తారు..

## బిజెపి ఆద్వర్యంలో పుణ్యక్షేత్రాలు పరిశుభ్రత



**ఆస్పరి,జనవరి 14,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరి సమీపంలో పేరుగాంచిన శ్రీ రామతీర్థం పుణ్యక్షేత్ర సన్నిధిలో భారత ప్రధాని నరేంద్రమోడీ ఆచరణలలో భాగంగా బిజెపి ఆస్పరి మండల అధ్యక్షులు నరసప్ప ఆద్వర్యంలో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం రామతీర్థం పుణ్యక్షేత్ర ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 500సం॥ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అయోధ్యలో ఆగస్టు 5-2020న ప్రధాని మోడీ చేతుల మీదుగా రామమందిరంకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అయోధ్యలో శ్రీ రామమందిరం మహా పుణ్యక్షేత్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుంచి 22వరకు దేశంలో ఉన్న అన్ని దేవాలయాలు,పుణ్యక్షేత్రాలు పరిశుభ్రతగా ఉండేందుకు ఈ కార్యక్రమం ప్రధాని చేపట్టారన్నారు. దేశంలో దేవాలయ ఆవరణలో శుభ్రంగా ఉండడమే ఆయన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా చేయాలనే పిలుపునందుకుని సమాజంలో విభిన్న వర్గాల ప్రజలందరు ఆచరణలోకి తీసుకుని పాటించాలని కోరారు. అయోధ్యలో రామమందిరంలో రాముల ప్రాణ ప్రతిష్టాపన దేవాలయ ప్రారంభోత్సవం సందర్భంగా జనవరి 22న దేశ ప్రజలందరు తమ ఇళ్లల్లో శ్రీరామ జ్యోతిని వెలిగించాలని ఈ శుభ సందర్భంలో భారతీయులందరు దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు పిలుపునిచ్చారన్నారు. బిజెపి మండల ఉపాధ్యక్షులు లక్ష్మన్న,తలారి పులికొండ,ఓబులేషు,హరి తదితరులున్నారు.

## పండుగ సమయాల్లో క్రీడలు ఆహ్లాదకరం-ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి



**వెల్దుర్తి,జనవరి14,ప్రభాతవార్త :** పండుగ సమయాల్లో క్రీడలు నిర్వహించడం ఆహ్లాదకరమని వెల్దుర్తి ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల ఆటస్థలంలో ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా మండలస్థాయి సూపర్8 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పట్టణ వైకాపా కార్యదర్శి వెంకటనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.వారి ఆహ్వానం మేరకు వెల్దుర్తి ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.తను క్రికెట్ ఆడి అందరిని అలరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి పండుగ సమయాల్లో ఇటువంటి క్రీడలను నిర్వహించడం ఒకరికొకరి మధ్య స్నేహాభావం ఏర్పడుతుందన్నారు.క్రీడాకారులకు ఎంతో ఆరోగ్యమన్నారు.ఈ పోటీల విజేతలకు మొదటిబహుమతి రూ.10,016,రెండవ బహుమతి రూ.5,016( టివిఎస్ మినరల్స్) దాతలుగా ఉన్నారన్నారు.ఒకప్పటి క్రీడాకారుడు ఏ.సోమశంకరవరప్రసాద్ నేడు వెల్దుర్తి సిహెచ్‌సిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ క్రికెట్ పోటీలకు రావడంతో అతన్ని ఎస్సై చేతుల మీదుగా శాలువ పూలమాలతో సత్కరించారు. పట్టణ వైకాపా కార్యదర్శి వెంకటనాయుడు,వెల్దుర్తి సిహెచ్‌సి డాక్టర్.ఏ.సోమశంకరవరప్రసాద్,సీనియర్ క్రీడాకారులు బాచి,సుధీర్,చిరంజీవి,వెంకి,హాఫీజ్ పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

### - టీడీపీ యూత్ లీడర్ బొగ్గుల దస్తగిరి



**సిబెళగల్,జనవరి14,ప్రభాతవార్త:** సిబెళగల్ మండల పరిధిలోని సిబెళగల్,బురాన్‌దొడ్డి,గొల్లలదొడ్డి గ్రామాల్లో టీడీపీ లీడర్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ యూత్ లీడర్ బొగ్గుల దస్తగిరి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా దస్తగిరి ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆయన తెలిపారు.అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పథకం ద్వారా చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు,రైతులకు అన్నదాత పథకం కింద ప్రతి ఏడాది రూ.20వేలు,నిరుద్యోగ యువతకు యువగళం నిధి కింద ప్రతి నెల రూ.3వేలు భృతి,ప్రతి ఆడబిడ్డకు సంవత్సరానికి రూ.18వేలు అందజేస్తుందని దీని ద్వారా ప్రతి కుటుంబానికి రూ.1.22లక్షల లబ్ది చేకూరనుందని ఆయన తెలియజేశారు.జగన్ అధికారం చేపట్టాక రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని,పరిశ్రమలు రాకపోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగ యువత రోడ్ల పైకి వస్తున్నారని,జగన్ పాలనలో నిత్యవసర వస్తువుల ధరలు,విద్యుత్ చార్జీలు,ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో బడుగు,బలహీన,సామాన్య వర్గాలకు చెందిన ప్రజలు అల్లాడిపోతున్నారని ఆయన ఆరోపించారు.అలాగే జగన్ పాలనలో అనేక రంగాలు కులేలయ్యాయని ఆయన ఆరోపించారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తిమ్మప్ప,హోటల్ భీమన్న,గుడిపాడు మహేశ్వరరెడ్డి,అమర్‌నాథ్,ధనుంజయ్, రాంమోహన్‌రెడ్డి,రామాంజనేయులు,మారందొడ్డి సోమన్న,జిక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరగట్టు మాలమల్లేశ్వరుడిని దర్శించుకున్న ఆలూరు ఇంచార్జ్ విరుపాక్షి

**హొళగుంద,జనవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎంతో ప్రసిద్దిగాంచిన దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామిని ఆలూరు వైకాపా నూతన ఇంచార్జ్ విరుపాక్షి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆలూరు వైకాపా ఇంచార్జ్ విరుపాక్షి మాట్లాడుతూ వైసిపి ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్‌గా భాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి మాలమల్లేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగిందన్నారు. మాలమల్లేశ్వర స్వామి ఆశీస్సులతో ఆలూరు నియోజకవర్గ అభివృద్ది కోసం అహర్నిషలు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలే తన సమస్యలుగా తీసుకుని సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చూస్తానన్నారు. అలాగే రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈయన వెంట వైసిపి నాయకులు దొడ్డబసప్ప,దర్గన్న,ఆనంద్,రవిస్వామి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## హొళగుంద మండల నాయకులకు ఒకసారి..ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి..!

**ఆలూరు,జనవరి 14,ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండల నాయకులకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అయినప్పటి నుండి ఇప్పటివరకు ఆలూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న దేవనకొండ,ఆస్పరి,ఆలూరు,హాలహర్వి,చిప్పగిరి అన్ని మండలాల నుండి ఇప్పటివరకు ఎమ్మెల్యేలుగా గెలుస్తూ వచ్చారన్నారు. హొళగుంద మండలం నుండి ఇప్పటివరకు ఎవ్వరు కూడా ఎమ్మెల్యేలు కాలేదన్నారు. అయితే గెలిచిన వారు ఎవరి మండలాన్ని వారే తమకు సంబంధించిన గ్రామాలకు ప్రత్యేక నిధులను తెప్పించుకుని అభివృద్ధి చేసుకున్నారన్నారు. అభివృద్ధికి ఆమడదూరంగా ఉన్న హొళగుంద మండలం వైపు ఏ నాయకుడు చూడలేని పరిస్థితిలో మన నాయకులు వున్నారన్నారు. కేవలం ఓట్లకు మాత్రమే పరిమితమైనటువంటి హొళగుండ మండల ప్రజలకు చిన్నచిన్న పదవులకే అంకితం చేస్తూ నియోజకవర్గ స్థాయిలో ప్రధానంగా అవకాశం ఇవ్వకపోవడం అనేది చాలా భాదాకరమన్నారు. అందుకే ప్రధాన పార్టీలకు విన్నవించుకుంటూ ఇప్పటికైనా మన హొళగుంద మండలం వైపు చూసి మంచి నాయకులను నియమించి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఇటు ఆలూరు నియోజకవర్గ ప్రజలు,పార్టీల అధిష్టానానికి ఎల్లార్తి అర్జున్ విన్నవించుకున్నారు.

## ఉచితంగా గుండె పరీక్షలు,రక్తదాన శిబిరం

**మద్దికెర,జనవరి 14,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలోని హరిజన కాలనీలో ఈ నెల 17న బుధవారం ఆపద్బాందవ సేవా సమితి,బేతేలు క్రిస్టియన్ అసెంబ్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత గుండె వైద్య శిబిరం,మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు,దైవ సేవకులు సి ఆనంద్,రాజు,రాజశేఖర్,మధు,ఆపద్బాందవ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కా సునీల్‌కుమార్,కార్యదర్శి రవికుమార్‌లు తెలిపారు. ఉచిత గుండె పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9908363532,9032925944ను సంప్రదించాలన్నారు.

## ఏపి భూహక్కు చట్టంను తక్షణమే రద్దు చేయాలి

**దేవనకొండ,జనవరి 14,ప్రభాతవార్త :** ఏపి భూమి యాజమాన్య హక్కుట చట్టం 27/2023ను తక్షణమే రద్దు చేయాలని రైతుల కడుపుకొట్టే చీకటి జీఓ 512ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏపి రైతుసంఘం మండల అధ్యక్షుడు జి నాగరాజు,సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరసింహులు,సిపిఐ నల్లచెలిమిల శాఖ కార్యదర్శి బజారిలు అన్నారు. ఆదివారం రైతుసంఘం దేవనకొండ మండల సమితి ఆద్వర్యంలో భోగిమంటల్లో 512జీఓ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెవెన్యూ విభాగము ఫారెస్ట్ మైన్స్ తదితర రంగాలు అన్నీ కూడా అవినీతిలో కూరుకుపోయాయని ఇలాంటి అవినీతి చేస్తున్న అధికారులకు భూ పరిష్కారాల విషయం అప్పగిస్తే రైతులుక న్యాయం జరగదన్నారు. కోర్టులలో చెప్పే తీర్పు కన్నా రెవెన్యూ అధికారులు చెప్పే తీర్పులు న్యాయబద్దంగా ఉంటాయని ఎవరూ భావించడం లేదన్నారు. ఈ చట్టాన్ని తీసుకురమ్మని ఏ ఒక్క రైతు కూడా ప్రభుత్వాన్ని అడగలేదన్నారు. కావున తక్షణమే 512జీఓను రద్దు చేయాలన్నారు. ఈ చట్టం రద్దయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ సహాయ కార్యదర్శి ఉచ్చీరప్ప,రైతుసంఘం మండల సమితి సభ్యులు రంగస్వామి,నగేష్,గోమారి నరసింహులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్మా చట్టం జీఓనం.7ను భోగిమంటల్లో కలిపిన అంగన్‌వాడీలు

**ఆస్పరి,జనవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండ ఎస్మా చట్టాన్ని అమలు చేసిన జీఓనం.7ను అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్లు సిఐటియు,ఏఐటియుసి ఆద్వర్యంలో భోగిమంటల్లోకి జీఓనం.7పత్రాలు వేసి దగ్ధం చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 34వరోజుకు చేరుకుంది. ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు ప్రమీళమ్మ,జ్యోతిల అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు,రైతుసంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రయ్య,రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామిలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఎస్మా చట్టాన్ని ఉపయోగించి విధుల్లోకి చేరాలని అంగన్‌వాడీ టీచర్స్ ను హెల్పర్ల ఇంటి వద్దకి విఆర్‌ఓలు,సచివాలయ ఉద్యోగులు,తలారులు దౌర్జన్యంగా,బలవంతంగా నోటీసులు తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడడం సరైందికాదన్నారు. నోటీసులు తీసుకుని ఉద్యోగాల్లోకి చేరాలని లేకపోతే మీ అంతు చూస్తామని మహిళలని కూడా చూడకుండ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అంగన్‌వాడీలు కన్నీరు మున్నీరవుతున్నారన్నారు. తక్షణమే బెదిరింపులకు పాల్పడుతున్న విఆర్‌ఓలను సచివాలయ ఉద్యోగులు,తలారులను ఉన్నతాధికారులు అదుపు చేయాలని లేకపోతే అంగన్‌వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. నోటీసులు ఇవ్వడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు విశ్వకుమారి,సరోజమ్మ, నాగమణి,చాయాదేవి,రాణి,బేగం,లత తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా సమస్యలు తీరడం లేదు..!

**ఆదోని రూరల్,జనవరి 14,ప్రభాతవార్త :** ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా గ్రామాల్లో సమస్యలు మాత్రం తీరడం లేదని ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోనబావి పంచాయతీ పరిధిలోని హొసూరు గ్రామాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తాగునీరు,డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నోఏళ్లుగా తాగునీటి కోసం 5కి.మీలు ప్రజలు అవస్థలతో వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే పట్టణ,మండలాల్లో కొన్ని గ్రామాల్లో అనేక బోర్లు వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయి నీరురాక భూగర్బ జలాలు,చెక్ డ్యాంలు లేక ఇంకిపోయి రైతులు వలసబాట పట్టడంలో జిల్లాలో మొదటి స్థానం ఉందన్నారు. అలాగే జలయజ్ఞం ద్వారా పొలాలకి నీరు అందించడంలో జగన్ ప్రభుత్వం విఫలమవ్వడం అందరికీ తెలిసిందేనని,తాగునీరు అందించడంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం చాలా సిగ్గుచేటని ఆగ్రహించారు. పాత్రికేయులు కూడా ఈ గ్రామాన్ని సందర్శించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే,సబ్ కలెక్టర్ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సమాజ సేవకులు బీసీ రాజారెడ్డి జన్మదిన వేడుకలు

### - టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య

**బనగానపల్లెరూరల్,జనవరి14,ప్రభాతవార్త:** సమాజ సేవకుడిగా నిత్యం ప్రజల కోసం పరితపించే నాయకుడు బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అని నంద్యాల జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు,ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య అన్నారు.ఆదివారం పట్టణంలోని స్థానిక టంగుటూరి శీనయ్య కార్యాలయం నందు బీసీ రాజారెడ్డి జన్మదిన వేడుకలను టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించి బీసీ రాజారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం,వారి అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు బీసీ రాజారెడ్డి అని కొనియాడారు.ప్రజల దాహార్తిని తీరుస్తున్న జలదాత,నిగర్వి,స్నేహశీలి,అందరితో కలుపుగోలుగా ఉండే తత్వం,ఆపదలో ఉన్నవారికి అండగా ఉండే ఆపద్బాంధావుడు,పేదలకు,అంధులకు బాసటగా నిలిచిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని,నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని అలాగే రానున్న రోజుల్లో బీసీ రాజారెడ్డి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని టంగుటూరి శీనయ్య ఆ భగవంతుడిని కోరుకున్నారు.అదే విధంగా బీసీ రాజారెడ్డి తనకు చిన్ననాటి నుండి మంచి స్నేహితుడని ఇలాంటి మంచి మనస్సున్న వ్యక్తి సమాజానికి ఎంతో అవసరమని టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు.అదే విధంగా స్నేహమంటే జీవితం అనేట్లుగా స్నేహానికి ఎక్కువ విలువ ఇచ్చే వ్యక్తి బీసీ రాజారెడ్డి అని ఈ సందర్భంగా టంగుటూరి శీనయ్య గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఆర్.సి.నాగిరెడ్డి,బాలిరెడ్డి,రెడ్డి సంఘం నాయకులు మల్లారెడ్డి,కైప పక్కీరారెడ్డి,టపాల దస్తగిరి,లాయర్ నాగేంద్రారెడ్డి,ఖాదర్ బాషా,బత్తులూరుపాడు రామచంద్రారెడ్డి,వాణిజ్య విభాగాల నాయకులు బచ్చు భాస్కర్,ప్రసాద్,కామేష్,ఆకుల షేక్షావలి,కోడి నాగేశులు,శీనయ్య వ్యక్తిగత కార్యదర్శి జోలాపురం హరి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ పాదయాత్రకు సంఘీభావంగా యాత్ర

**ఆదోనిలీగల్, జనవరి14, ప్రభాతవార్త;** కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మణిపూర్ నుంచి ముంబై వరకు భారత్ జోడో న్యాయ యాత్ర చేపట్టారు. ఇందుకు మద్దతుగా ఆదివారం ఆదోని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దేవిశెట్టి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీశాఖ అధ్యక్షుడు ఎంఎం నూర్ మాట్లాడుతూ ఈ న్యాయయాత్ర ముఖ్య ఉద్దేశ్యం ఉద్యోగాలు లేని యువత కోసం, అప్పులపాలైన రైతుల కోసం, అధిక ధరలతో బాధపడుతున్న భారతదేశ జ్రల కోసం, సరైన వైద్యం, ఉపాధి కోసం పోరాడడం జరుగుతుందన్నారు. తమ అధినేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఈ యాత్ర 15 రాష్ట్రాలు, 110 జిల్లాలు, 6,700 కి.మీ., 66 రోజులు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.తాయన్న, జిల్లా మైనార్టీ కార్యదర్శి మహ్మద్‌బేగ్, ఆదోని మైనార్టీ సెల్ చైర్మన్ బి.రఫిక్‌అహ్మద్, మండలాధ్యక్షుడు కుప్పగల్ అయ్యప్ప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతు, పెద్దతుంబళం ఏజెంట్ నరసప్ప, మండల మైనార్టీ అధ్యక్షుడు దాదాఖలందర్, అమ్మద్, అమరావతినగర్ రామకృష్ణ, అమరావతి నగర్‌వాసులు, రైతులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ బద్ధంగా భోగి పండుగ

**జూపాడుబంగ్లా, జనవరి 14, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ మొదటి రోజైన భోగి పండుగను మండలంలోని ఆయా గ్రామాలు ప్రజలు ఆదివారం సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్లముందు కళ్లాపి చల్లి ముగ్గులకు రంగులు అంటించి, గొబ్బెమ్మెలతో అందంగా అలంకరించారు. తెలుగు వారికి ప్రీతిపాత్రమైన పండుగగా సంక్రాంతి. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురువడంతో వ్యవసాయ పంటలైన వరి,శనగ, కంది తదితర పంటల దిగుబడులు తగ్గినప్పటికీ ధాన్యం ఇళ్లు చేరుకుంటున్నాయి. కష్టాలకు వీడ్కోలు.. సుఖానికి స్వాగతం పలికే విధంగా, చెడుపై విజయానికి సంకేతంగా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితి. తమ ఇళ్లలో ఇష్ట దైవానికి మొక్కులు తీర్చుకుని మకర సంక్రాంతి పండుగను జరుపుకోవడానికి, మహిళలు రాత్రి నుంచే రంగవల్లులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

## రాష్ట్రానికి పట్టిన పీడ తొలగిపోవాలి

**ప్యాపిలి జనవరి14(ప్రభాతవార్త):** రాష్ట్రానికి పట్టిన పీడ తొలగిపోవాలని జిల్లా బిసి సెల్ కమిటి అధికార ప్రతినిధి రామ్మోహన్‌యాదవ్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం బోగిమంటలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగి మంటలలో పనికి రాని వస్తువులను దహనం చేస్తారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలకు సంబంధించిన జీవో కాగితాలను బోగి మంటలలో వేసినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజా వ్యతిరేక పాలకులను సాగనంపుతారని స్పష్టం చేశారు. మండల ప్రజలు సంక్రాంతిని సంబరంగా ఆనందంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్మా చట్టం జీవోలను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపిన అంగన్‌వాడీ వర్కర్స్

**బేతంచెర్ల,జనవరి14,ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెకు దిగితే ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరింపులకు గురిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా చట్టం జీవో 2ను అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి,మండల అధ్యక్షురాలు ఎస్.గుల్జార్‌బీల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతబస్టాండ్ నందు జీవో పత్రాలను భోగి మంటల్లో వేసి కాలుస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా షేబారాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యూటీ అమలు చేయడం,నెలకు రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు.చర్చల పేరుతో కాలయాపన చేయడం,అంగన్‌వాడీలను బెదిరిస్తూ నియంతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించడం సరికాదన్నారు.దేశం మొత్తం సంక్రాంతి పండుగను ఎంతో సంతోషంగా జరుపుకుంటుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అంగన్‌వాడీ మహిళలు రోడ్ల పై ఉండే పరిస్థితి జగనన్న ప్రభుత్వం కల్పించిన పుణ్యమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు కమల,సులోచన, శివలక్ష్మి,వెంకటలక్ష్మి,మహాలక్ష్మి,పుష్పావతి, నారాయణమ్మ,రాజేశ్వరి,దస్తగిరమ్మ,విజయమణి,అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## బాల్య జ్ఞాపకాలు మరువలేనివి

**కొలిమిగుండ్ల,జనవరి14,ప్రభాతవార్త:** పాఠశాలలో విద్యను అభ్యసించే రోజుల్లో బాల్యజ్ఞాపకాలు మరువలేనివని బీజేపీ మండల కమిటీ మాజీ అధ్యక్షులు గూడూరు శివరామిరెడ్డి,(బ్రీడ్స్) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బోయ రవికుమార్‌లు పేర్కొన్నారు.మండలంలోని బెలుంగుహల ఆవరణంలో 2008-2009 పదవ తరగతి బ్యాచ్‌కు సంబంధించిన పూర్వపు విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంక్రాంతిని పురస్కరించుకుని భోగి మంటలువేసి సంబరాలు నిర్వహించారు.అనంతరం పాఠశాల సమయంలో పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుని గురువుల బోధనలను గుర్తు చేసుకున్నారు.త్వరలో మరో సమావేశాన్ని ఏర్పాటుచేసి తాము చదువుకున్న కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వపు విద్యార్థులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ఆదోని రూరల్,జనవరి 14,ప్రభాతవార్త :** అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు తాలుక సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్,డిఎస్పీ శివనారాయణస్వామిల ఉత్తర్వుల మేరకు తాలుక సిఐ పర్యవేక్షణలో పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య తన సిబ్బందితో కడితోట గ్రామం వద్ద అక్రమంగా కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న వారి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన సిసింద్రీ,విజయ్‌లకు చెందినవిగా గుర్తించి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి 960టెట్రా ప్యాకెట్లు,మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## గుమ్మనూరు జయరాంకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే నేను పోటీకి సిద్దం..!

**హొళగుంద,జనవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే నేను పోటీకి సిద్దమని ఎల్లార్తి ప్రజాసేవకుడు మల్లికార్జున అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి గుమ్మనూరు జయరాంకు వైసిపిలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే ఆలూరు నియోజకవర్గం నుండి ఏ పార్టీ నుండైనా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్దంగా ఉన్నానని తెలిపారు. అలాగే ఆలూరు నియోజకవర్గ అభివృద్ది కోసం కృషి చేస్తామన్నారు. చిప్పగిరి,హాలహర్వి,దేవనకొండ,ఆస్పరి,ఆలూరు నుండి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారని అయితే ఏఒక్క పార్టీ కూడా హొళగుంద మండల నాయకులకు అవకాశం కల్పించలేదన్నారు. హొళగుంద మండల నాయకులను దృష్టిలో ఉంచుకుని ఏ పార్టీ అయినా సరే మండల నాయకులకు అవకాశం కల్పిస్తే గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## భోగి మంటల్లో జీవో కాపీలను తగులబెట్టిన అంగన్‌వాడీలు

**చాగలమర్రి,జనవరి14,ప్రభాతవార్త:** స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐటీయుసీ ,సీఐటీయు నాయకురాళ్లు ఆధ్వర్యంలో 34 రోజులుగా సమ్మె చేస్తున్న సందర్భంగా ప్రభుత్వం వారికి నోటీసులు జారీ చేయడంతో ఈ నోటీసులను ఆదివారం భోగి మంటల్లో తగులబెట్టేశారు.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్సర్‌బాషా,తెలుగుదేశం పార్టీ నాయకులు వారి దీక్షలకు మద్దతు పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఎస్మా జీవో 2ను వెంటనే ఉపసంహరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు క్రిస్మస్ పండుగను,జనవరి నూతన సంవత్సరాన్ని,సం క్రాంతి పండుగను దూరం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అంగన్‌వాడీ కార్యకర్తలందరూ ఏకమై తగిన గుణపాఠం చెప్పాలన్నారు.అంగన్‌వాడీలు చేస్తున్న ఉద్యమానికి ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలియజేయడం జరిగిందన్నారు.భవిష్యత్తులో వారు చేసే ప్రత్యక్ష పోరాటానికి కూడా మద్దతు పలుకుతామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ,సీఐటీయు నాయకురాళ్లు చంద్రకళ,వహీదా, హసీనా,ఇందుమతి,పద్మావతి,నాగమణి,సంజమ్మ,అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాబుచాంద్,రెహనా,గుర్రమ్మ,నసీమున్,జ్యోతి,అసనమ్మ,టీడీపీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి అనిఫ్,గుత్తి నరసింహులు,అజీమ్,గఫార్,జిలేబి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి

**చాగలమర్రి,జనవరి14,ప్రభాతవార్త:** నిరుద్యోగ యువత స్వయం ఉపాధితో ఎదగాలని జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబులాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డిలు,చక్రంబీడీ అధినేత,ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ముల్లా షబ్బీర్ అహమ్మద్‌లు తెలిపారు.ఆదివారం చాగలమర్రిలోని కడప-కర్నూలు పాత హైవే పై యువకుడు ఏర్పాటుచేసుకున్న ఎంకేబీ ఇంటీరియల్ స్పాట్ దుకాణాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడకుండా వారి వ్యక్తిగత తెలివితేటలతో వివిధ రకాల రూపాల్లో స్వయంశక్తితో ఎదగాలని తెలిపారు.వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేవారికి బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేస్తున్నాయని ఇలాంటి అవకాశాలు ప్రతిఒక్క నిరుద్యోగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్ బురానుద్దీన్,ఖాదర్ మొహిద్దీన్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ కుటుంబానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

**పత్తికొండ,జనవరి14,ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి,పత్తికొండ మండల మాజీ ఎంపిపి నాగరత్నమ్మ దంపతుల్లో ఒకరికి వైఎస్సార్‌సీపీ పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని వారు కోరారు.ఆదివారం పట్టణంలోని రామచంద్రారెడ్డి,నాగరత్నమ్మ దంపతులు వారి స్వగృహం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రివర్యులు ఎస్.వి.సుబ్బారెడ్డి పత్తికొండ నియోకవర్గం నుండి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిరాని అలాగే మంత్రిగా పనిచేశారని వారు గుర్తు చేశారు.అలాగే ఎస్వి సుబ్బారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప నియోజకవర్గంలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదని వారన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఎస్ఆర్ స్వగృహానికి వెళ్లి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీకు న్యాయం చేస్తామని ఎస్ఆర్ కుటుంబానికి భరోసా ఇచ్చారని వారు తెలిపారు.ఆ భరోసాతోనే పన్నెండు సంవత్సరాలు వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ఏ పిలుపు ఇచ్చినా పత్తికొండ నియోజకవర్గంలో తూచ తప్పకుండా నిర్వహించామని అలాగే నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి తమ వంతు అహర్నిశలు కృషి చేశామన్నారు. ఎస్వి సుబ్బారెడ్డి మూడుసార్లు పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేయడంతోపాటు మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధితోపాటు నియోజకవర్గంలో విద్య,వైద్యం కోసం భవనాల ఏర్పాటు,మారుమూల గ్రామాల నుండి పట్టణానికి చేరుకునే విధంగా రోడ్లు వేయించడం,ఆర్టీసీ డిపో ఏర్పాటు,బాలికల,బాలుర గురుకుల పాఠశాలల ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ తమ కుటుంబానికి ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కానుకగా ఇస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు,సహకార సొసైటీ బ్యాంకు చైర్మన్ శ్రీనివాసరెడ్డి,వైస్ ఎంపిపి పల్లె ప్రతాప్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి కొమ్ము నెట్టేకల్,పత్తికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొమ్ము దీపిక,మాజీ సర్పంచ్ సోమశేఖర్,వార్డుమెంబర్లు పాలబాషా,బండి మస్తాన్,కాళహస్తి సుంకన్న,కురువ సంఘం కర్రి లింగన్న,నాయిబ్రాహ్మణ సంఘం లింగన్న,శ్రీకాంత్‌రెడ్డి,కృష్ణారెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి,వాల్మీకి సంఘం రాష్ట్రనాయకులు ఆస్పరి నరేంద్ర,చంద్ర,బాల్‌రెడ్డి,మేకల రామాంజనేయులు,నాగరాజు,గుండు మహమ్మద్,చక్రాల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

వార్త



# కర్నూల్లోని నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా




**కర్నూలు న్యూసిటీ, జనవరి 14, ప్రభుతవార్తః** కర్నూలులో ఉన్న నిరుద్యోగ యువత కోసం ప్రతే ్యకంగ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జీ టీజీ భరత్ అన్నారు. మౌర్యాఇన్‌లో ఆయన జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుదో ్యగులు రోజు రోజుకు పెరిగిపోతున్నారన్నారు. తమ కంపెనీలో వేలాది మందికి ఉపాధి కల్పించామని అయినప్పటికి ఉద్యోగం కావాలంటూ తమ వద్దకు రోజు 10 వరకు అప్లికేషన్లు వస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 18 కంపెనీలతో మాట్లాడి ఈనెల 24న మౌర్యా ఇన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతినెల లేదా రెండు నెలలకు ఒకసారి ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్దం చేస్తున్నట్లు భరత్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే కర్నూలుకు కంపెనీలు తీసుకువచ్చి ఇక్కడే ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని చెపారు. పారిశ్రామిక వేత్తగా ఇక్కడికి పరిశ్రమలు తీసుకువచ్చే సత్తా తనకు ఉందని టీజీ అన్నారు. టిడిపి గెలిస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజుయాదవ్, హెచ్‌డిఆర్ యూత్ సభ్యులు శివ, జనార్ధన్, రాజశేఖర్, ఈశ్వర్, శ్రీను, పరమేష్, శ్రీనాథ్, భరత్, కుమార్, ధను, రాజు, రమేష్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నోరు విప్పితే ఉపాధి హుష్‌కాకి

## - గుత్తేదారుల గుప్పిట్లో
## గుక్కురుమంటున్న బాధితులు ఎందరో

**బేతంచెర్ల,జనవరి14,ప్రభాతవార్త:** దేశంలోనే రంగురాళ్ల పరిశ్రమకు ప్రసిద్దిగాంచిన బేతంచెర్లలో రోజు రోజుకు ఉపాధి ఊసేలేకుండా పోతుంటే రైల్వే డబుల్ లైన్ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో ఉపాధి దొరికిందిలే అనుకున్నా ఉపగుత్తేదారులకు దినకూలీలు,వాహనాల నిర్వాహకులు గుత్తేదారుల ఆగడాల పై నోరు విప్పితే ఉపాధి ఎక్కడ హుష్‌కాకి అవుతుందోనని గుత్తేదారుల గుప్పిట్లో గుక్కురుమంటున్న బాధితులు ఎందరో అన్న అనుమానానికి ఇటీవల ఓ మేస్త్రీ గుత్తేదారు తమకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఏకంగా సెల్‌టవరెక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన తీరు అద్దంపడుతుందని చెప్పక తప్పదు.రైల్వేశాఖ చేపట్టిన నంద్యాల నుండి డోన్ వరకు జరుగుతున్న రైల్వేడబుల్ లైన్ పనులకు సాంకేతిక నిపుణులతోపాటు ఇతర నిర్మాణాలు,కంకర,పట్టాల కింద వేసే దిమ్మెలు,మట్టి చదును చేయడం వంటి పనులకు దిన కూలీల అవసరం అధికంగా ఉంటుంది.ఇందులో భాగంగా గుత్తేదారులు వారి వారి పనులను పూర్తి చేసుకునేందుకు గ్రామాల్లోని నిరుద్యోగ యువతను ఆకర్షించడం జరిగింది.ఇందులో భాగంగా ఇప్పటికే ఉపాధిలేక నిరుద్యోగులుగా మారిన యువత వారి వారి గ్రామాల్లోని దిన కూలీలను పిలుచుకుని వచ్చి గుత్తేదారులతో మాట్లాడుకుని రైల్వే పనులు చేయిస్తున్నారు.అయితే గుత్తేదారులు తమ పని కొనసాగించుకునేంతవరకు ఏ కారణాలు చెప్పకుండా ఆ తరువాత డబ్బులు ఇచ్చే సమయంలో మీరు చేసిన పనులు,పనులకు,వచ్చిన సమయాలు సరైనవికావని సాకులు చెబుతూ నెలల తరబడి కూలీల డబ్బులు ఇవ్వకపోవడంతో నిరుద్యోగ యువత కూలీలకు ఏమి చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నోరు విప్ప బయటకు చెబితే ఏదోలాగా ఉపాధి ఉందిలే అనుకున్నది కూడా ఎక్కడ పోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు.ఇదిలా ఉండగా బేతంచెర్ల మండలంలో రహదారులు,వివిధ ప్రభుత్వ శాఖల భవనాలు,వాటర్‌గ్రిడ్ పనులు వేల కోట్ల రూపాయలతో జరుగుతున్నాయి.ఇందుకు సంబంధించి మట్టి తరలించేందుకు ట్రాక్టర్లు వంటి వాహనాలు దినకూలీలు,తాపీమేస్త్రీలు,రక రకాల నైపుణ్యం కలిగిన పనివారు అవసరం ఏర్పడింది.దీంతో పలువురు మండలంలోని ఆయా రంగాలకు చెందిన కూలీలు,వాహన నిర్వాహకులు ఏదో రకంగా గుత్తేదారుల దగ్గర పనులను ఒప్పుకుని వాటిని పూర్తి చేయడం జరుగుతుంది.అయితే బిల్లుల సమయానికి నానా సాకులు చెబుతూ చేసిన బిల్లుల డబ్బులను తగ్గించడమే కాకుండా కాలయాపన చేస్తుండడంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పలువురు మేస్త్రీలు,గుత్తేదారులు ఇళ్లకు అద్దెలు కట్టలేక,తినడానికి



తిండిలేక,వైద్యఖర్చులకు వెసులుబాటులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసేవారు అధిక సంఖ్యలో ఉన్నా బయటికి పొక్కితే రావాల్సిన డబ్బులు రాకపోగా లేని చిక్కుల్లోపడి ఎక్కడ ఇబ్బందికి గురవుతామోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కేవలం ఒక మేస్త్రీ మాత్రమే దిక్కుతోచని స్థితిలో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన అందరికి తెలిసినా అనేక మంది లోలోనే కుమిలిపోతున్న కూలీలు అధిక సంఖ్యలో ఉన్నారన్నది పలువురి వాదన.ఏది ఏమైనా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన మేస్త్రీ లాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులది,గుత్తేదారులన్నది గుర్తెరిగితే మంచిదని పలువురు కోరుతున్నారు.

## పండగ పూట అర్ధ ఆకలితో అంగన్‌వాడీలు..

**కోసిగి, జనవరి 14, ప్రభాతవార్త :** సంక్రాంతి తెలుగు వారికి అత్యంత ప్రీతికరమైన పండుగ.. బంధు, మిత్రులతో సంతోషాల నడుమ ఉత్సాహంగా జరుపుకునే పండుగ సంక్రాంతి.. పల్లెల్లో పండుగ సందడితో వాతావరణం కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది.. కానీ అంగన్‌వాడీల జీవితాల్లో మాత్రం సంక్రాంతిని కోల్పోతున్నారు.. అర్థాకలితో అల్లాడుపోతున్నారు.. న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని కోరుతు గత రెండు నెలల నుండి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెను చేపట్టారు.. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని, రిటైర్డుమెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలని కోరుతూ అంగన్‌వాడీలు దీక్షను చేపట్టారు.. కానీ ప్రభుత్వంలో నుండి ఇంతవరకు ఎలాంటి స్పందన కనిపించడం లేదు.. విద్యాశాఖమంత్రి బోత్స సత్య నారాయణ మాత్రం అంగన్‌వాడీ రాష్ట్ర నేతలతో జరిపిన చర్చలు విఫలమవుతూనే ఉన్నాయి.. అంగన్‌వాడీలు అడుగుతున్న సమస్యలను పరిష్కారించే దిశగా ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో అంగన్‌వాడీలు దీక్షలను విరమించుకోవడం లేదు.. అత్యవసర సేవల కిందకు వీరిని తీసుకొచ్చి వీరిపై ఎస్మా చట్టంను ప్రయోగించినప్పటికి అంగన్‌వాడీలు బెదరలేదు.. దీంతో పలుమార్లు మంత్రులు చర్చలు జరిపినా ఫలితం కనిపించడం లేదు.. ఈ నేపథ్యంలో పట్టువిడువని విక్రమార్కుల్లా అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగిస్తుండడంతో సంక్రాంతి పండుగను చేసుకోలేక పోతున్నారు..తమ జీవితాల్లో క్రాంతి నింపడం లేదని, సంక్రాంతి వచ్చిన తమకు అర్థాకలి మిగిలిందని, ముఖ్యంగా సంక్రాంతి పండుగ తమ లోగిళ్లను మార్చడం లేదని వాపోతున్నారు..తెలుగు వారికి ఎంతో అత్యంత భరితమైన పండుగ అయినప్పటికి తాము చీకట్లోలోనే మగ్గిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దీంతో తాము పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందంటున్నారు..ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల జీవితాల్లో క్రాంతి నింపే సంక్రాంతిని పండుగను జరుపుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది..

**భోగి మంటల్లో ప్రభుత్వ నోటీసులు:** అంగన్‌వాడీలు విధుల్లో చేరాలని బలవంతంగా జారీచేసిన నోటీసులను సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం అంగన్‌వాడీలు భోగీ మంటల్లో నోటీసులను కాల్చివేసారు..రానున్న ఎన్నికల్లో కూడా ఇలాగే ప్రభుత్వాన్ని మంటల్లో వేస్తామని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కారించకుంటే ఇదే గతి పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. నోటీసులను జారీ చేసిన ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త భోగీ మంటల్లో వీటిని వేసి కాల్చివేసి భోగీని జరుపుకున్నారు..

## కర్ణాటక మద్యం స్వాధీనం

### :-రూ.1.50 లక్షల మద్యం పట్టివేత :-28 బాక్సులు,ఓ వాహనం అదుపులోకి
### :-ముగ్గురిపై కేసు నమోదు :-నిందితులు రిమాండ్‌కు తరలింపు



**బూదూరు(మంత్రాలయం),జనవరి 14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూదూరు నాలుగురోడ్ల కూడలి వద్ద పెద్దమొత్తంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ జయరాం నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు.వివరాల మేరకు మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందినకట్టుబడి ఖాదర్,బోయ మహదేవప్ప,పెద్దకడ ్బూరు మండలం కంబదహాలు గ్రామానికి చెందిన బోయ మారెన్న అనే ముగ్గురు వ్యక్తులు ఓ కారులో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నామన్నారు.,వీరివద్దనుండి సుమారు రూ.1,50 లక్షలు విలువచేసే 28 బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకునా ్నమన్నారు.మొత్తం 2688 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.వీరివెంట ఎస్‌ఐ సోమశేఖర్‌రావు,సిబ్బంది గౌస్ రబ్బానీ,గోపాల్,లింగప్రసాద్, రామచంద్రుడు,నరసింహారెడ్డి,ఇందుమతి తదితరులు ఉన్నారు.

## " ఏవీ అలనాటి సంక్రాంతి సంబరాలు ..? "

**కొలిమిగుండ్ల, జనవరి 14, ప్రభాతవార్త :** సంక్రాంతి .. ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది అచ్చమైన, పచ్చనైన పల్లెటూళ్ళు .. పచ్చని పైర్లు .. కలం నిండా ధాన్యాపు రాశులు .. కుప్పనూర్పుతున్న రైతన్నలు .. హరిదాసుల సంకీర్తనలు .. గంగిరెద్దుల విన్యాసాలు .. గజ్జెల చప్పుల్లు .. వీధుల్లో రంగవల్లులు .. వాటిపై గొబ్బెమ్మలు పెట్టే అడపడచులు .. మహిళల ముచ్చట్లు .. ఇలా ఒక్కటేమిటి అచ్చమైన తెలుగుతనం ఉట్టి పడేలా సంక్రాంతి సంబరాలు కనువిందు చేస్తాయి. ఇలా రైతన్నల దగ్గరనుండి పెద్ద పెద్ద ఉద్యోగుల వరకు సంక్రాంతి సంబరాలు ముఖ్యంగా పల్లెసీమల్లో రైతన్నల ఇంట అకాశన్నంటుతాయనడంలో ఏటువంటి అతిశయోక్తి ఉండేది కాదు. అన్నదాతల పైర్లు పండిన తరువాత వచ్చే మొదటి పండుగగా సంక్రాంతికి ఏంతో గుర్తింపు వుంది. బోగి పండుగ రోజున నూతన వస్త్రాలను ధరించి పండిన ధాన్యాన్ని రైతు తొలుతగా తమ ఇంటి దేవునికి నైవేద్యంగా పెట్టి తిరిగి అధాన్యాన్ని తెచ్చి కలంలో వున్న రాశిలో కలుపుతారు. ఇలా చేస్తే అరాశులు రెండింతలుగా పెరిగి రైతన్నల ఇంట సుఖసంతోసాలు వెల్లివిరుస్తా యని వారినమ్మకం. అయితే ఇది ఒకప్పటి గత చరిత్రగా మిగిలిపోతోంది. ప్రస్థుతం సంక్రాంతి సంబరాలు ఇసుమంతయినా కనిపించక బోసిపోతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పచ్చని పైర్లు కానరాని పరిస్థితి. రైతుల కలాల్లో ధాన్యాపు గింజలు లేక వెలవెల బోతున్నాయి. దిగుబడి తగ్గి నష్టాల్లో కూరుకపోయిన సగటు అన్నదాత సాంప్రదాయ సంక్రాంతి సంబరాలను ఏనాడో మరచిపోయాడు. అనాడు హరిదాసు సంకీర్తనలకు ఉప్పొంగిన రైతన్నలు చాటలతో ధాన్యాపు గింజలను వారికి బహుమతిగా పోసేవారు. కానీ నేడు పిరికేడు గింజలను పెట్టడానికి సైతం అన్నదాతకు పరిస్థితులు కలిసి రావడంలేదు. పలితంగా ధరల కొలిమిలో సంక్రాంతి బోగి మంటలు వెలవెల బోతున్నాయి. పెరిగిన నిత్యావసర ధరలు సామాన్య మధ్యతరగతి ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అన్నదాతల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్నచందంగా మారిపోయింది. కూరగాయలు మొదలు కొని కందిపప్పు, బియ్యం వరకు ధరలు సలసలా మండిపోతున్నాయి. మరోవైపు ప్రభుత్వం పెంచుతున్న వివిధ రకాల చార్జీల ధరలను చూసి ప్రజల గుండెలు జారిపోతున్నాయి. పండుగ పూట పట్టు వస్త్రాలు అటుంచి జానెడు బట్ట కొనుగోలు చేయలేని స్థితిలో వున్నామంటూ రైతన్నలు సామాన్య ప్రజలు నిట్టూర్చే పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పెరిగిన ధరలు ప్రజలను సంతోషాలకు దూరం చేస్తున్నాయి. పండుగంటే గుర్తొచ్చేది పిండివంటలు కానీ వాటిని చేసుకోనే పరిస్థితులు కానరావడం లేదంటూ మహిళలు వాపోతున్నారు.

పండని పంటలు - సాగుకు నోచుకోని పొలాలు:- ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా, సాగుచేసిన పంటలు పండకపోగా, లక్షలాది ఎకరాలు బీడు భూములుగా మిగిలిపోయాయి. జిల్లాలో రబీలో ప్రధానంగా సాగుచేసిన పుప్పు శనగ వర్షాలు లేకపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని అన్నదాతలు వాపోతున్నాపరు. దీంతో సంక్రాంతి సంబరాలు రైతుల ఇంట వెలవెలబోతున్నాయని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

## బెలుంగుహల్లో పర్యాటకుల సందడి

### - ఆదివారం ఒక్కరోజే రూ.1.53లక్షల ఆదాయం



**కొలిమిగుండ్ల,జనవరి14,ప్రభాతవార్త:** మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతగాంచిన బెలుంగుహల్లో పెద్దఎత్తున పర్యాటకుల సందడి నెలకొంది.గత కొద్ది రోజులుగా పాఠశాలలకు,ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు రావడంతో బెలుంగుహలకు పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం ఒక్కరోజే రూ.1.53లక్షల రికార్డుస్థాయి ఆదాయం లభించినట్లు బెలుంగుహల యూనిట్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి వెల్లడించారు.రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక,తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు బెలుంగుహలకు పెద్దఎత్తున తరలివస్తున్నారు.ఈ సందర్భంగా గుహల ఆవరణంలోని బుద్ద విగ్రహంతోపాటు గుహల లోపలి ప్రాంతంలోని పాతాళగంగా,ఊడలమర్రి,సన్యాసిమఠం,ధ్యానమందిరం, వెయ్యి పడగలు తదితర ప్రాంతాలను తిలకిస్తున్న పర్యాటకులు సరికొత్త అనుభూతిని పొందుతున్నారు.గుహలోపల,గుహల ఆవరణంలో పర్యాటకులకు మరిని ్న సౌకర్యాలు కల్పించాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

## భారత్‌లో బంగ్లాదేశ్ యువకుడి సైకిల్‌యాత్ర

### - రక్తదానం,డ్రగ్స్ నిర్మూలనే తన ధ్యేయమంటున్న బంగ్లా యువకుడు



**కొలిమిగుండ్ల,జనవరి14,ప్రభాతవార్త:** సాధించాలన్నా తపన ఉంటే లక్ష్యం ఎంత పెద్దది అయిన సాధ్యమేనని నిరూపిస్తున్నాడు బంగ్లాదేశ్‌కు చెందిన ఓ యువకుడు.రక్తదానం,డ్రగ్స్ నిర్మూలన కోసం తన వంతుగా భారతదేశ యాత్ర చేయాలని భావించి సైకిల్ పై యాత్రను ప్రారంభించాడు.ఆదివారం కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహలకు చేరుకున్న సందర్భంగా బంగ్లాదేశ్ యువకుడిని ప్రభాతవార్త పలకరించింది.2023 డిసెంబర్ 19న బంగ్లాదేశ్ దేశంలోని రంగమటి జిల్లా నుంచి సైకిల్‌యాత్రను ప్రారంభించడం జరిగిందని యువకుడు బిర్ కుమార్ అచంగ్యా వెల్లడించాడు.బంగ్లాదేశ్‌లోని రంగమటి జిల్లాలో రక్తదానం,కాలుష్య నియంత్రణ,మత్తు పదార్థాల నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని బిర్ కుమార్ వెల్లడించాడు.భారతదేశంలో కూడా పర్యటించి ప్రజలకు వీటి పై అవగాహన కల్పించాలని యాత్ర చేపట్టినట్లు తెలిపారు.ఇప్పటికే భారత్‌లోని పశ్చిమబెంగాల్,ఛత్తీష్‌ఘడ్,అస్సాం,ఒరిస్సా,తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటించి ఆంధ్రప్రదేశ్‌కు చేరుకోవడం జరిగిందన్నారు.భారత్‌లోని 29 రాష్ట్రాల్లో తాను పర్యటించనున్నట్లు వెల్లడించాడు.సుమారు 3వేల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు బిర్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన లక్ష్యాన్ని పలువురు అభినందించారు.

## సంక్రాంతి పర్వదిన సందర్బంగా
## పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు

### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా



**ఆత్మకూరు జనవరి14,ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ శిల్పా చక్రపాణిరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వంలో పేద ప్రజలకు ఎంతో అండగా నిలచి ఆర్థికంగా పేద ప్రజలు నిలచేందుకు నవతర్న సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి పండుగను పురష్కరించుకుంటున్న రాష్ట్ర ప్రజలకు వైసిపి మంత్రులకు ఎంఎల్‌ఏలకు, ఎంపిలకు, నియోజకవర్గ నాకులకు, వార్డు కౌన్సిలర్‌లకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంక్రాంతి బోగిని పురష్కరించుకోని రంగుల ముగ్గులతో పిల్ల పాపలతో వారి కుటుంబాలు, పాడి పంటలతో రైతన్నల శ్రేయోస్సు కోసం పాటుపడేదే వైసిపి ప్రభుత్వం అని కోనియడారు.

## ప్రతి ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలి
## - పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి



**వెల్దుర్తి,జనవరి14,ప్రభాతవార్త :** ప్రతి ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆదివారం ఆమె కర్నూలు నగరంలోని తన స్వగృహాంలో కుటుంబసభ్యులతో కలిసి రంగురంగుల ముగ్గులు వేసి,గొబ్బెమ్మలను ఉంచారు. బోగిమంటలను వేసి కుటుంబసభ్యులతో ఆస్వాదించారు.ఆలయా నికి వెళ్లి స్వామి అమ్మవార ్లకు ఎమ్మెల్యే శ్రీదేవి ప్రత్యేక పూజలు చేశారు.గోమాతకు సైతం పూజలు చేసి, చిన్నారులకు బోగిపళ్లు వేసి ఆశీర్వదించా రు.ఈ సందర్భంగా ఆమె ప్రజలందరికి భోగిపండుగ శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నిత్యం పరితపించే సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (జగనన్న) కుటుంబసభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవుని ్ని కోరుకున్నానన్నారు.ఈ భోగి మనందరి జీవితాల్లో భోగభాగ్యాలతో పాటు సుఖసంతోషాలను అందించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంగాటి వాసంతమ్మ,కుటుంబసభ్యులు ,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం వ్యక్తి పరార్

### విలువ రూ 1,50000



**ఎమ్మిగనూరుక్రైం, జనవరి14 ప్రభాతవార్త:** కర్ణాటక రా ష్టనికి చెందిన మద్యంను అక్రమంగా తరలిస్తున్న మంత్రాలయ నియోజకవర్గ పరిధిలోని వగరూరు గ్రామాం సమీపంలో ఒక కారులో 28 బాక్సులులో 2688 టెట్రా ప్యాకెట్‌లును స్వాధీనం చేసుకోన్నారు. వ్యక్తిచౌరలెట్ కారులో మద్యంను తీసుకోని పోలిసులను చూసి పోలలో కారును వదిలి పారిపోవడం జరిగింది, దీంతో కారు, మద్యంను స్వాధీనం చేసుకోని నిందుతుడిని పట్టుకోమని సెబ్ సిఐ జయరామనాయుడు తెలిపారు. ఈసందర్భంగా విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యంను తరలిస్తున్న వారిపే ప్రత్యేక దృష్టి పెట్టమని అలగే మద్యంను తరలిస్తున్న వారి సమాచారాని తెలిపిన వారి వివరాలును కూడా గోప ్యంగా ఉంచుతామని తెలిపారు. ఎస్‌ఐ సోమశేఖర రావు, హెడ్ కానిస్టేబుల్స్ రబ్బని, గోపాల్, పోలిసులు నరసింహారెడ్డి, రామచంద్ర, ప్రసాద్‌లు సెబ్ అధికారి జయరామనాయుడు వారిని అభినందించారు.

## కర్నాటక మద్యంపై కేసు నమోదు

**నందవరం, జనవరి 14, ప్రభుతవార్తః** కర్నాటక రాష్ట్ర మద్యాన్ని తరలిస్తుండగా ఆ వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు నందవరం ఎస్‌ఐ పి తిమ్మయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రాబడిన సమాచారం మేరకు ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె తుంగభద్ర వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు నందు రాయచోటీ గ్రామానికి చెందిన తెలుగు రామాంజనేయులు కర్నాటక మద్యం సంచిలో తీసుకువస్తుండగా పోలీసులు నిఘా ఉంచి పట్టుకున్నారు. అందులో కర్నాటక మద్యం 384 ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంటల్లో పాక్షికంగా లారీ దగ్ధం...



**మిడుతూరు, జనవరి14, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన మిడుతూరు నుంచి నందికొట్కూరుకు వెళ్లే రహదారిలో పంచముఖీ గోడౌన్ సమీపంలో సిమెంట్‌లో కలిపే క్లింకర్ లోడుతో వెళ్తున్న లారీకి ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మంటల్లో లారీ పాక్షికంగా దగ్ధమయ్యింది. గడివేముల మండలంలోని జిందాల్ ఫ్యాక్టరీ నుంచి క్లింకర్ లోడుతో బయలుదేరిన లారీ పంచముఖీ గోడౌన్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి ఒకవైపు వాలి పడింది. ఈ సంఘటనతో లారీలో మంటలు చెలరేగాయి. లారీ ఇంజన్ వైపు మంటలు చెలరేగడంతో లారీ క్యాబిన్, కొన్ని టైర్లు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మిడుతూరు ఏఎస్‌ఐ సుబ్బయ్య, కానిస్టేబుళ్ల ధనుంజయ, శ్రీనివాసులు, కర్నూలు ఫైర్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్‌ఇంజన్ ప్రమాద స్థలానికి చేరుకొని లారీలో చెలరేగుతున్న మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు.

## గోదారంగనాధుల కళ్యాణం అంగరంగ వైభవంగా



**కర్నూలు విద్య, జనవరి 14, ప్రభుతవార్తః** కర్నూలు నగరంలో భరతమాత గుడిలో గోదారంగనాధుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నెలరోజుల నుండి ధనుర్మాస పూజ భక్తి భావాలతో జరిగింది. విష్ణు సహస్రనామ సంఘ పెద్దలు మల్లెల పుల్లారెడ్డి, శ్రీనివాసులు భరతమాత గుడి అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి కమిటీ మెంబర్లు కలిసి ముఖ్యంగా మహిళలు, భక్తులు, కార్యకర్తల కృషి ఎంతగానో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి, బజరంగదళ్ ప్రతాపరెడ్డి, సందడి మహేష్, సందడి సుధాకర్, విశ్వహిందూ పరిషత్ ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

## మోటర్ సైకిళ్ల దొంగ అరెస్టు

### -మూడు మోటర్ సైకిళ్ళు స్వాధీనం -నిందితుడు రిమాండ్‌కు తరలింపు



**మాధవరం(మంత్రాలయం), జనవరి 14,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాధ వరం అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద మోటర్ సైకిళ్ళ దొంగను అరెస్టు చేసినట్లు మాధవరం ఎస్‌ఐ కిరణ్‌బాబు ఆదివారం విలేకరులకు తెలిపారు.వివరా ల మేరకు తమ సిబ్బందితో చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం,రాయచూరు జిల్లా,మట్‌మారి గ్రామానికి చెందిన ముల్లా మొయినుద్దీన్ అనేవ్యక్తి అనుమానంతో పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకున్నామన్నారు.పట్టుకున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించి తమదైన స్టైల్‌లో విచారించామన్నారు.ఈ విచారణలో ఈ వ్యక్తి జలా ్సలకు అలవాటుపడి మోటర్ సైకిళ్ళను దొంగిలించి వాటిని ఇతర వ్యక్తులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నట్లు తెలిపారు.నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.మోటర్ సైకిళ్ళ దొంగను అరెస్టు చేసిన మాధవరం పోలీసులను సిఐ ఎరిషావలి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది వీరేష్,వీరాంజితదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజల కోసమే భారత్ జోడో న్యాయయాత్ర..!

### - రాహుల్‌గాంధీ న్యాయయాత్రకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు న్యాయయాత్ర



**ఆదోని రూరల్,జనవరి 14,ప్రభాతవార్త :** ఉద్యోగాలు లేని యువత కోసం,అప్పులపాలైన రైతుల కోసం,అధిక ధరలతో భాదపడుతున్న భారతదేశ ప్రజల కోసం రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర ప్రారంభించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎంఎం నూర్,నియోజకవర్గ ఇంచార్జ దేవిశెట్టి ప్రకాష్‌లు అన్నారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఘనవిజయం సాధించిన తర్వాత నేడు మణిపూర్ నుండి ముంబై దాకా భారత్ జోడో న్యాయయాత్ర ప్రారంభించారు. అందులో భాగంగా ఆదివారం ప్రారంభమైన న్యాయయాత్రకు మద్దతుగా ఆదోని కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన వైద్యం,ఉపాధి కోసం ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని రాహుల్‌గాంధీ ఈ యాత్ర ప్రారంభించారన్నారు. ఈ యాత్ర 15రాష్ట్రాలు 110జిల్లాలు 6700కి.మీ 66రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ యాత్ర మార్చి 20న ముంబైలో ముగుస్తుందన్నారు. దేశ ప్రజల కోసమే ఈ యాత్ర చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బి తాయన్న,జిల్లా మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ బేగ్,ఆదోని మైనార్టీ సెల్ చైర్మన్ బి రఫీక్ అహ్మద్,మండల అధ్యక్షుడు కుప్పగల్ అయ్యప్ప,మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు హనుమంతు,పెద్దతుంబళం ఏజెంట్ నరసప్ప,నూతనంగా ఎన్నికైన మండల మైనార్టీల అధ్యక్షుడు దాదా ఖలందర్,నిసార్ అహ్మద్,అమరావతి నగర్ రామకృష్ణ,భారీఎత్తున రైతులు పాల్గొన్నారు.